తగ్గుతున్న నాటుకోళ్ల పెంపకం

- రోజురోజుకి పెరుగుతున్న నాటుకోడి ధరలు
- రేటు విషయంలో పొట్టేళ్ల మాంసంతో పోటీ
- కొనడానికి వెనుకాడుతున్న మధ్య తరగతి ప్రజలు



పుల్లంపేట : రోజురోజుకు నాటుకోళ్ల పంపకం తగ్గిపోతుంది. గతంలో గ్రామాలలో ప్రతి ఇంటిలో నాలుగు కోళ్లను తప్పనిసరిగా పెంచేవారు. ప్రస్తుతం గ్రామాల ప్రజలు నాటుకోళ్లను పెంచడం దాదాపు మానేశారు. అరకొరగా కొంతమంది ఇంటికి ఒకటో లేదా రెండు కోళ్లను మాత్రమే పెంచడంతో నాటుకోడి మాంసం ధర పొట్టేళ్ల మాంసానికి సమానమైంది. దీంతో నాటుకోడి మాంసం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షలా తయారైంది. గతంలో చికెన్ కంటే నాటుకోడి కిలోకు రూ. 50లు మాత్రమే అధికంగా ఉండేది. ప్రస్తుతం పొట్టేళ్లు మాంసానికి సరిసమానంగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు నాటుకోడి మాంసం కొనలేని పరిస్థితి నెలకొంది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ప్రజలు నాటుకోళ్ల కోసం గ్రామాల బాట పట్టేవారు. గ్రామాల్లో కోళ్ల పెంపకం తగ్గడంతో అందుబాటులో పౌల్ట్రీ చికెన్ రావడంతో గత్యంతరం లేక బ్రాయిలర్ కోడినే ప్రజలు ఆశ్రయిస్తున్నారు. కార్తిక మాసం ముగియడంతో ప్రస్తుతం చికెన్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. కిలో చికెన్ ధర రూ. 200లు నుంచి రూ. 220ల వరకు పలుకుతోంది. పండగలకు రూ. 250లు నుంచి రూ. 300ల వరకు పలికినా కొనడానికి వెనుకాడరు. సంక్రాంతి పండుగ చివరిరోజు గతంలో వడలలోకి నాటుకోడిని వాడేవారు. ప్రస్తుతం బ్రాయిలర్ చికెన్ ఆ స్థానాన్ని ఆక్రమించింది అనడంలో అతిశయోక్తి లేదు. రాబోయే రోజుల్లో నాటుకోటి పెంచేవారు, కొనుగోలు చేసేవారు ఉండకపోవచ్చు. ఎందుకంటే గతంలో మార్కెట్‌లో చికెన్ ధరకు సమానంగా లేదంటే తక్కువగా పల్లెల్లో దొరికేవి. దీంతో మండల ప్రజలు చుట్టుపక్కల గ్రామాలలో నాటుకోళ్లను ఆసక్తిగా కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం నాటుకోళ్ల అరకొరగా ఉండటంతో ధర ఆకాశాన్ని అంటడంతో నాటుకోళ్లను కొనుగోలు చేయడానికి సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీంతో పండుగలకు సైతం మార్కెట్‌లో చికెన్‌ను కొనుగోలు చేస్తున్నారే తప్పా నాటుకోళ్ల చికెన్ జోలికి వెళ్లేందుకు ఆలోచించడం లేదు.

కోదండ రామాలయాన్ని అభివృద్ధి చేయండి

- రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి
- సీపీఎం మండల సభలో నేతల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతి ఏడాది నిధులు కేటాయించి పర్యాటకంగా తీర్చిదిద్దాలని, టీటీడీకి అనుసంధానం కాకుండా స్వతంత్రంగా ఆలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ఒంటిమిట్ట మండల కేంద్రంలో సీపీఎం మండల మహాసభ షాదీఖానా హాల్‌లో సీతారం ఏచూరి ప్రాంగణం పేరుతో మండల కమిటీ సభ్యుడు రాము అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువుకు సోమశిల బ్యాక్ వాటర్ సప్లై చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని, అలాగే మండలంలో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతమైయ్యాయని, ఆ భూములను రెవెన్యూ సదస్సులో స్వాధీనం చేసుకోవాలన్నారు. గతంలో మండల కేంద్రంలో ఇంటిస్థలాలు ఇచ్చిన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిలో భాగంగా కడప స్టీల్ ప్లాంట్‌ను నెలకొల్పాలని వారు డిమాండ్ చేశారు. సోమశిల బ్యాక్ వాటర్ ద్వారా చెరువులకు నీరు నింపి ఆయకట్టు భూములకు నీరు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో వాగ్దానాల మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. తల్లికి వందనం కింద పిల్లలకు రూ. 15 వేలు ఇస్తామన్నారని, మహిళలకు ప్రతినెలకు రూ.1500 ఖాతాలలో జమ చేస్తామని చెప్పిన హామీలను నిలబెట్టుకోవాలని తెలియజేశారు. వాగ్దానాలు అమలు పరచకుంటే పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య, పార్వతమ్మ, వెంకటేష్, సిద్దవటం మండల కార్యదర్శి నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

సుండుపల్లె : మండల పరిధిలోని చౌక దుకాణాలకు శాశ్వత డీలర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రెడన్న తెలిపారు. మండలంలోని మడితాటివాండ్లపల్లె (బీసీ – సీ మహిళ), గుంతరాచపల్లి (ఎస్సీ), పెద్దబలిజపల్లి (బీసీ – డీ మహిళ), సిద్దారెడ్డిగారిపల్లి (ఈడబ్ల్యూఎస్), వానరాచపల్లి (ఎస్సీ), జికె రాచపల్లి (ఓసీ), జంగంపల్లి (ఎస్టీ), రాయవరం (ఓసీ), నందనాయక్ బిడికి (ఓసీ), దిన్నెల (బీసీ – డీ), కురవపల్లి (బీసీ – ఏ), కోనంకివారిపల్లి (ఓసీ), ఆనందనగర్ (ఓసీ) చౌక దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు, ఇంటర్మీడియట్ విద్యార్హత ఉన్న వారు ఈనెల 15వ తేదీలోపు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

14న మెగా లోక్ అదాలత్

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 14వ తేదీ మెగాలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫైజున్నీషా పేర్కొన్నారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకునే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

క్రీడా సామగ్రి వితరణ



సామగ్రిని అందజేస్తున్న దాతలు

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గూడూరు సీతమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు గూడూరు సుబ్బరాయుడు నాయుడు సుమారు రూ.10 వేలు విలువచేసే క్రీడా సామగ్రిని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవితకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కె.చంద్రశేఖర్ నాయుడు, గ్రామ పెద్దలు వెంకటాద్రి నాయుడు, ఎంపీ నారాయణ, సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, గిరిధర్, షామీర్, అసీఫ్ బాషా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన విద్యుత్ ఎస్ఈ

చిన్నమండెం : అన్నమయ్య జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.రమణ సోమవారం చిన్నమండెం మండలం కేశాపురం గ్రామంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయనకు సూచించారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. అనంతరం తన స్వగృహంలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

రోడ్డు పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని వైకోట గ్రామంలో సోమవారం రూ. 30 కోట్ల వ్యయంతో పక్కా సిమెంట్ రోడ్డు పనులను కడప అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రోడ్లులేని చోట పక్కా సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా రూ. 30 కోట్లతో వైకోట గ్రామంలో సిమెంట్ రోడ్లు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ బాల నరసింహులు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకలో మాజీ ఎమ్మెల్యే

రామాపురం : మండలంలోని హసనాపురం గ్రామం ఎర్రంగివాండ్లపల్లెకు చెందిన భాస్కర్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హాజరై విందు కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలను తెలియజేశారు. ఆయనతోపాటు మాజీ జెడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అధ్యాపకురాలికి డాక్టరేట్



స్వర్ణసురేఖ

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీ అధ్యాపకురాలు స్వర్ణ సురేఖకు డాక్టరేట్ లభించింది. ఆమె ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని జెఎస్ యూనవర్సిటీ (షికోహాబాద్)చే పీహెచ్‌డీని అందుకున్నారు. ది ఫ్యూచర్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈమె విజయవాడకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా.దుగ్గిరాల శరత్‌బాబు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఆమెను ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి, చాన్సలర్ చొప్పా అభిషేరెడ్డిలు అభినందించారు.

ప్రజాసమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

ప్రజాదర్బార్‌లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా అన్నమయ్య జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో జిల్లాలో ఎవరూ భూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రతి మండలంలో నెలకు ఒకసారి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రైతులకు నాణ్యమైన అందించామన్నారు. వచ్చే జనవరి మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికి కొత్త ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అవినీతిని ఉపేక్షించమని తెలియజేశారు. అనంతరం మండల పరిధి నల్లగుట్టపల్లెలో నూతనంగా వేసిన బోరుకు మోటర్‌ను బిగించి గ్రామానికి నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

వీరబల్లి : మద్యం తాగి ఆటో నడుపుతున్న ఓబులేశు అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. సోమవారం సానిపాయి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చిత్తూరు జిల్లా ఎర్రంవారిపల్లి ఉచ్చుకాయల పెంటకు చెందిన ఓబులేశు మద్యం సేవించి ఆటో తోలుతుండగా తనిఖీలో గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆలయ పూజారి మృతి



మధురభారతం బాల సుబ్రమణ్యం (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని గాంధీవీధిలో వెలసివున్న భక్తాంజనేయ స్వామి ఆలయ పూజారి మధురభారతం బాలసుబ్రమణ్యం (సుబ్బు) అనారోగ్యంతో ఆకస్మాతుగా సోమవారం మృతి చెందారు. బ్రాహ్మణ సంఘంలో కీలకంగా వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటున్న వ్యక్తి మృతి చెందడం బాధాకరమని సంఘ అధ్యక్షులు పి.రామ్మోహన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. నేడు మధ్యాహ్నం అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ గెలుపుపై ఉపాధ్యాయుల సంబరాలు



కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీచర్లు

రాయచోటి అర్బన్ : ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం సాధించడం పట్ల రాయచోటిలో ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ప్రాంగణంలో ఉపాధ్యాయులు కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జాబీర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణించారు. ఈ కారణంగా జరిగిన ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన బొర్రా గోపిమూర్తి 9165 మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలవడం అభినందనీయం అన్నారు. ఈ గెలుపు ప్రజాస్వామ్యానికి మలుపు అని అభివర్ణించారు. లాబీయింగ్‌లు, ఊసరవెల్లి రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు హఫీజుల్లా, శ్రీధర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, చంద్రశేఖర్, దావుద్దీన్, అమీనుల్లా, ఆదిల్, రాజబాబు, హసానుల్లా, విశ్వనాథ రెడ్డి, వేణుగోపాల్, అల్తాఫ్, అజీర్, ఉమాశంకర్, రాజారమేష్, సీఐటీయూ నేతలు రామాంజులు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.3850 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పీజీ, ఇంజనీరింగ్, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నం. 77ను వెంటనే రద్దుచేయాలంటూ కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను పరిష్కరించాలంటూ సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ తిరుమలేసు

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలేసు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని దేవపట్లకు చెందిన తిరుమలేసు సొంత పనుల నిమిత్తం దేవపట్ల వద్ద జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో తన ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ స్కూటర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ తిరుమలేసును 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనర్హుడికి ఇచ్చిన పట్టాను రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి

పుల్లంపేట : రెవెన్యూ సదస్సు పుల్లంపేటలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. సర్వేనెంబరు – 280/1లో నిబంధనలకు విరుద్ధంగా అవ్వారు విజయ్‌బాబు పేరిట ఆన్‌లైన్‌లో నమోదైన 50 సెంట్ల ప్రభుత్వ భూమిని తొలగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అరవింద కిషోర్‌కు, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణారావులకు పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి వినతిపత్రం అందించారు. తదుపరి సర్పంచ్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సర్వే నెంబరు – 280లో 6.20 ఎకరాలు తోపు పోరంబోకు భూమికలదు. ఈ భూమిని ప్రభుత్వం హిందూవుల శ్మశానవాటికకు కేటాయించింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.5లక్షలతో ప్రహరీగోడ ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వంలో కోటి రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ప్రహరీగోడను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓలకు ఫిర్యాదు చేయడం జరిగిందని, కావున తక్షణమే ఆన్‌లైన్ రద్దు చేయాలని లేకుంటే రాజంపేట రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని సర్పంచ్ తేల్చి చెప్పారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

నందలూరు : ప్రధాన మంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ విశ్వనాథ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ గర్భిణులకు బీపీ, రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను ఉచితంగా అందజేశామన్నారు. 29 మంది గర్భిణులను గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల్ సేవా సమితి సభ్యులు భరత్, నరేష్, పెంచలయ్య, రాము, గంధం గంగాధర్, నరేష్, పెంచలయ్యల ఆధ్వర్యంలో గర్భిణులకు, ఆశా వర్కర్లకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటనారాయణ, సూపర్‌వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి టౌన్ : విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు విశేష కృషి చేయాలని డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని అర్చన విద్యాసంస్థలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని చెప్పారు. ప్రధానంగా తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి షఫీవుల్లా, అబ్జర్వర్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, అర్చన విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, డీఆర్పీలు సీహెచ్ వెంకటరమణ, ఏడుకొండలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సురెన్సు ప్రీమియం చెల్లించలేం



సుండుపల్లె: హెచ్ఓ వినితకు వినతిపత్రం అందజేస్తున్న మామిడి రైతులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సచివాలయ సిబ్బందికి, రైతులకు మామిడి పంట ఇన్సురెన్సు చేసుకునే విధానం గురించి సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఉద్యానశాఖ అధికారి వినిత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద పంటల బీమా ప్రక్రియ నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత నాలుగు, ఐదు సంవత్సరాలుగా మామిడి పంటలకు చీడపీడ పురుగులు ఎక్కువై ఆదాయం లేకుండా పోయిందని, తోటలు దుక్కి దున్నుకోవడానికి.. మందులు పిచికారీ చేసుకోవడానికి కూడా డబ్బులు లేక దీనవస్థలో ఉన్నామని తెలిపారు. ప్రతి రైతు ఎకరాకు రూ. 2250లు ఇన్సురెన్సు కట్టుకోమని అధికారులు చెబుతున్నారని, ప్రభుత్వం దయ ఉంచి భారీ మోతాదులో లేకుండా కనీస ప్రీమియం ప్రతి ఎకరాకు రూ. 500లు వరకు ఉంటే కట్టుకోగలమని ఆలా లేకుంటే రెండు, మూడు సంవత్సరాలలో మామిడి తోటలు పంటలు చేతికి రాకుండా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఉద్యానశాఖ అధికారి వనితకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి తోటల రైతులను ఆదుకోవాలని వారు కోరారు. మార్కెటింగ్ సౌకర్యం లేక దళారుల వ్యవస్థతో చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.




సిద్దవటం: ఇన్సురెన్స్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జయభరత్‌రెడ్డి

మామిడి రైతులు ప్రీమియంను చెల్లించాలి

సిద్దవటం (ఒంటిమిట్ట) : మామిడి రైతులు పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని సిద్దవటం ఉద్యానశాఖ అధికారి (హెచ్ఓ) జి.జయభరత్ రెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన సిద్దవటంలోని వ్యవసాయం కార్యాలయంలో మామిడి రైతులతో సమావేశమయ్యారు. మాట్లాడుతూ బీమాతో రైతులకు భరోసా ఉంటుందన్నారు. పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఆదుకునేందుకు బీమా ఉపయోగపడుతుందన్నారు. రైతులు రూ.2100ల ప్రీమియంను ఈ నెల 15వ తేదీలోపు చెల్లించి ఇన్సురెన్స్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జయ జయభారత్ రెడ్డి, వ్యవసాయ అధికారి కె రమేష్ రెడ్డి, ఏఎస్ఓ శివప్రసాద్, ఎపీసీ డిస్ట్రిక్స్ ఇన్‌చార్జ్ సునీల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



మాట్లాడుతున్న కేకే చౌదరి

చిట్వేలి : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఖాదీబోర్డు చైర్మన్ కేకే చౌదరి అన్నారు. ఎంపీపీ సభా భవనంలో సోమవారం ఎంపీపీ చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందించేందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనితా దీప్తి, రామరాజుల నాయుడు, బాలాజీ, నాగార్జున నాయుడు, గుండాలయ్య యాదవ్, వెంకటేష్ రాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మోహన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కేవీపల్లె : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం వద్ద తహశీల్దార్ క్రాంతికుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

13న ఐటీఐలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వీరభద్రుడికి పల్లకి సేవ



ఆలయ మాఢ వీధుల్లో వీరభద్రుడిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలో వెలసి భక్తుల విశేష పూజలు అందుకుంటున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి సోమవారం భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ జరిపారు. అంతకుముందు స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పూజలు జరిపి పల్లకిలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివో రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.



తెల్లవారుజామున చెయ్యేరు నదిపై లేత సూర్యకిరణాలు ప్రతిబింబిస్తున్న దృశ్యం

అరుణోదయ శోభితం

లేత కిరణాలు.. చెయ్యేరు నదీ సోయగాలను మరింత సుందరోపేతంగా.. ప్రకృతి అందాలు నదీ అలల కౌగిట్లో కరిగిపోతున్నట్లుగా కనిపించిన దృశ్యం చెయ్యేరు(నందలూరు)నది తీరంలో ఆవిష్కృతమైంది. చెయ్యేరు ప్రకృతి అందాలు.. ఊహకు అందని రీతిలో అందరిని ఆస్వాదించేలా చేసింది. మంచుతెరలను చీలుస్తూ చలిని పక్కకునెట్టి వెచ్చదనం పంచేందుకు వస్తున్న భానుడిని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– రాజంపేట